# సంస్కరణ

సంస్కర్త, సామాన్యుడూ ఎదురు పడ్డారు పెద్ద బజారులో. సంస్కర్త సామాన్యుడి భుజం మీద చేయివేసి, '' ఏమోయ్, ఇంత పాడైపోయావేం?'' అని అడిగాడు

సామాన్యుడు అనుమానం వేసి తన వంక తనే చూసుకున్నాడు కాసేపు. జేబు దగ్గిర చిరిగినషర్టు బిళ్ళగోచీ పంచె, పైని తుండుగుడ్డ, కొంచెం చెరిగినక్రాపూ జేబులో పావలా డబ్బులూ, తనేమీ మారలేదే? సామాన్యుడు తలెత్తి సంస్కర్తలోకి చూసి, ''నేనేం పాడైపోయానండి? మామూలుగానే ఉన్నాను'' అన్నాడు.

సంస్కర్త మోకాళ్ళ వరకూ వేళ్ళాడే ఖద్దరులాల్చీ, జీరాడే గ్లాస్కో పంచె, పైకి దువ్విన అమెరికన్ క్రాప్, గోవాడ పై పంచె, కొల్హాపూర్ స్లిప్పర్లు తొడుక్కొని, సామాన్యుణ్ణి చలవ సులోచనాల్లో గుండా తీవ్రంగా చూసి. ''నువ్వంటేనువ్వేకాదోయ్, అసలు సంఘమే పాడైపోయింది.'' అన్నాడు ఆదుర్దాగా.

సామాన్యుడు తలగోక్కుని, ''గావును, ఎవ్వరితోనూ చెప్పకుండా అట్లా చెడిపోడం ఏమిటండి,'' అన్నాడు సీరియస్‌గా.

సంస్కర్త సులోచనాలు పై పంచెతో తుడుస్తో, ''సంఘం అనేక విధాల పాడైపోతోంది. తెలుసా?'' అన్నాడు మరీ ఆదుర్దాగా.

సామాన్యుడు తాపీగా ఒక తాజ్‌మహల్ బీడి వెలిగించి, ''పోతే పోనీండి, మనకెందుకూ మధ్య'' అన్నాడు పరాకుగా.

సంస్కర్త కోపంగా చూశాడు సామాన్యుణ్ణి. తర్వాత సులోచనాలు తగిలించుకొని, ''మనకి కాకపోతే, ఇంకెవ్వరికి పడ్డుందోయ్, చూడు. సంఘంలో హరిజనులు అణగారిపోతున్నారు.''

''నిజమే మరి'' అన్నాడు సామాన్యుడు.

''వాళ్ళకి దేవాలయ ప్రవేశం ఇప్పించాలి మనం'' అన్నాడు సంస్కర్త.

సామాన్యుడికి అనుమానం వేసింది. మాలవాళ్ళు అణగారిపోతుంటే చదువు చెప్పించాలి, అన్నం పెట్టించాలిగాని, దేవాలయ ప్రవేశం ఏమిటి వాళ్ళని మోసం చెయ్యటం కాకపోతే? సామాన్యుడు సంస్కర్తని ఎగాదిగా చూసి ''వాళ్ళకి దేవాలయ ప్రవేశం ఎందుకండీ? ఉన్న మతిపోవడానికా?'' అని అడిగాడు.

దాంతో సంస్కర్త సామాన్యుణ్ణి రోడ్డుపక్క అరుగుమీద కూర్చోబెట్టి, ''వాళ్ళకి దేవుణ్ణి దర్శించే హక్కు ఇప్పించాలయ్యా'' అన్నాడుకోపంగా.

సామాన్యుడికి ఇంకా అనుమానం వేసి, ''దేవుణ్ణి ప్రార్థిస్తే సరిపోతుందంటారా? ఇప్పటికి పాతికేళ్ళ బట్టి నేను దేవుడిని ప్రార్థిస్తూనే వున్నాను. ఏమీ ఊడిపడలేదు నాకు. వాళ్ళకే మాత్రం...'' అని ఇంకేదో చెప్పబోతో ఉంటే, సంస్కర్త సామాన్యుడిని ఆపి, ఆ సమస్య తప్పించేసి, ''అది పోనీవయ్యా, నీ కన్నీ సందేహాలే. ఇటు చూడు, సంఘంలో స్త్రీ స్వాతంత్ర్యం లేక అల్లాడి పోతోంది'' అన్నాడు.

సామాన్యుడు ఆలోచించాడు, ''నిజమేననుకోండి. మా ఆవిడ 'చదువుకోవే' అని మొత్తుకున్నా చదవడం లేదండి. ఏం చేయ్యను?'' అని అడిగాడు సంస్కర్తని .

సంస్కర్తసామాన్యుడిని కొంచెం చురచురచూసి, ''మీ ఆవిడ సంగతీ, మా ఆవిడ సంగతీటోయ్ మనం మాట్లాడేదీ'' అన్నాడు.

సామాన్యుడు కాస్త తగ్గి ''మా ఆవిణ్ణీ, మీ ఆఖిణ్ణి మినహాయించా మీరు మాట్లాడుతోంది? క్షమించండి.'' అన్నాడు.

సంస్కర్తమళ్ళీ మాట తప్పించి, ''నీకు బొత్తిగా సంస్కరణ అంటే ఏమిటో తెలియడంలేదోయ్'' అన్నాడు విగ్గుగా.

''నా కెట్టా తెలుస్తుందండి. సామాన్యుడిని'' అన్నాడు సామాన్యుడు నమ్రతగా.

సంస్కర్త ఎందుకో జేబులు తడవుకొని, '' ఒక బీడీ ఉంటే ఇవ్వవోయ్,'' అని అడిగాడు సామాన్యుడిని.

సామాన్యుడు బీడీ, నిప్పెట్టా రెండూ ఇచ్చి, ''అయితే మహాశయా, సంఘం అంతా పాడైపోయిందంటారా?'' అని అడిగాడు భయం భయంగా.

''మెల్లగా అంటావేమిటి'' అన్నాడు సంస్కర్త బీడీ వెలిగిస్తో.

''అయితే ఎట్లా?''

''సంస్కరణ చెయ్యాలి.''

''అంటే?''

''మళ్ళీ మొదటికొచ్చేవోయ్. మొదట హరిజనసమస్య, ఆ తర్వాత స్త్రీ జనోద్ధరణ, ఆ తర్వాత....

'' ఇంతకీ సామాన్యులు బతికే ఉపాయం, దరిద్రం ఒదిలే మార్గం ..... అవేమీ మన సంస్కరణ ప్రణాళికలో ఉండవా యేమండి?'' అన్నాడు సామాన్యుడు మామూలుగా.

''అవన్నీ పాశ్చాత్యవాసన వల్ల వొచ్చిన పాడు మనస్తత్వమోయ్, ఒకడి దరిద్రం ఒదిలించేందుకు మన మెవరిమోయ్, అదంతా సృష్టి విలాసం. భగవదేచ్ఛ!'' అన్నాడు సంస్కర్తగుడ్లు తేలేసి.

సామాన్యుడు ఈ వివరం నిజమని నమ్మలేకా, కాని పెద్దమనిషిని వ్యతిరేకించలేకా, ''పోనీ హరిజనోద్ధరణ, భగవదేచ్ఛకి ఒదిలి, స్త్రీ స్వాతంత్ర్యం విధికి వొదిలితే చిక్కు వొదులుతుంది కదండి?'' అన్నాడు.

సంస్కర్త సామాన్యుడిని ఎందుకోగాని మింగేద్దామా అన్నట్టుచూసి ''నీవు ఇట్టా అడ్డదిడ్డంగా మాట్లాడ కూడదోయ్, తెలిసీ, తెలియకా'' అన్నాడు.

సామాన్యుడికి ఈ మందలింపు అర్థం కాలేదు. ''తను మాట్లాడే గూడదా?''

''యామండి. నేనసలు మాట్లాడే గూడదంటారేమిటి? అందుకన్నా నాకు స్వేచ్ఛలేదూ?'' అని అడిగాడు కాస్త చికాకుగా.

సంస్కర్త జేబులోంచి ఓ కాయితం తీసి నువ్వు పెద్దల్ని ఇట్లా ప్రశ్నించకూడదు. ఇదిగో నువ్వుకూడా మా సంఘసంస్కరణోద్యమ సంఘంలో చేరు. చందా పావలా మాత్రమే'' అన్నాడు.

సామాన్యుడు, ఏడ్చినట్టుంది వ్యాపారం అని మనసులో అనుకొని, పావలా బిళ్ళ జేబులోంచి తీసి సంస్కర్త చేతిలోపెట్టి. ''చేర్చుకోండి నన్నూ ఓ సభ్యుడిగా-'' అన్నాడు గత్యంతరం లేక.

సంస్కర్త సంతోషంగా పావలా జేబులోకి నెట్టి, సామాన్యుడికి ఓ రశీదు పుస్తకం చూపించి, ''నువ్వూ ఇక సంస్కర్తవోయ్. ఈ పుస్తం తీసుకొని ఇంకా మెంబర్లని చేర్పించు. మన ఆశయాలు చెప్పి.'' అన్నాడు వెళ్లటానికి సిద్ధపడి.

కాని సామాన్యుడు పుస్తకం తీస్కోకుండా, '' ఎబ్బే! నాకు చాలా వేరే పన్లున్నయిలెండి.'' అని మర్యాదగా నిరాకరించి వెళ్లిపోయాడు. అక్కడి నుండి సంస్కర్త ''వీళ్లకేం తెలుసు సంస్కరణ అంటే'' అనుకుంటూ, కాళికాంబ కఫేలోకి పోయినాడు.

*(జ్యోతి సచిత్ర పక్ష పత్రిక ఏప్రియల్ 1948)*